క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కుడా కాలనీ, వాజ్‌పేయి కాలనీ, వికాస్‌నగర్, ప్రెసిడెన్సి స్కూల్, శ్రీకృష్ణ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, పూరిగుట్ట, పోలీసు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్ట, వాటర్ ట్యాంక్ వెనుక వైపు, వినాయక నగర్, సర్క్యూట్ హౌస్ రోడ్డు, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, నయీంనగర్, రంగు బార్, రాజాజీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, విశ్వనాథ కాలనీ, మెట్లబావి, బొర్ర యాదగిరి వీధి, రాములోరి వీధి, ప్రభుత్వ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

9నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హసన్‌పర్తి: జూన్ 9 నుంచి 11వ తేదీ వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు డబ్ల్యూడీబీఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి తెలిపారు. కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో బాలబాలికలతో పాటు పురుషులు, మహిళా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వచ్చేనెల 4వ తేదీలోపు http:// brtronline.in/ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94405 99888, 98480 27755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు దూరంగా బీఎంఎస్

హన్మకొండ: దేశ వ్యాప్తంగా ఈనెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు బీఎంఎస్, ఆ సంఘం అనుబంధ సంఘాలు దూరంగా ఉంటున్నాయని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ తెలిపారు. దేశంలోని కొన్ని కార్మిక సంఘాలు కార్మిక నియమావళిని వ్యతిరేకిస్తూ సమ్మె నిర్వహించాలని నిర్ణయించాయని, అయితే, ఈ సమ్మెలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ పాల్గొనదని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కార్మిక వేతన కోడ్‌ను బీఎంఎస్ స్వాగతించిందని పేర్కొన్నారు.

అనధికార క్వారీ నిర్వహణపై ఫిర్యాదు


కాజీపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా జనావాసాల మధ్య క్వారీ నిర్వహిస్తున్న వ్యాపారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ పి.ప్రావీణ్యకు వెస్ట్‌సిటీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. గృహాలకు 50 మీటర్ల దూరంలో రాత్రి, పగలు తేడా లేకుండా క్వారీ పనులు చేపట్టడంతో వాతావరణం కలుషితంగా అవుతోందని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

శివశక్తులకు ప్రశంసపత్రం అందజేత



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నానిగార్డెన్స్‌లో ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చౌదరి బిరుదాంకిత కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరై నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శివసత్తులకు చౌదరి బిరుదాంకిత ప్రశంసపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ల సంఘం అధ్యక్షురాలు లైలా, కార్పొరేటర్ పల్లం పద్మ, శివసత్తులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుల పంపిణీ



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలోని రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీ పార్కులో పలువురు భవన నిర్మాణ కార్మికులకు గురువారం లేబర్‌కార్డులు పంపిణీ చేశారు. లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్, కార్మికరత్న యమడాల హనుకాంత్, షేక్ అజ్గర్, శ్రీకాంత్, చందు, అజీజ్, రమేష్, స్వప్న, రాజు, నిర్మల, వసంత, స్రవంతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డివైడర్

- ధ్వంసమైనా పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



ధ్వంసమై ప్రమాదకరంగా ఉన్న డివైడర్



డివైడర్ పక్క నుంచి వెళ్తున్న కారు

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధి హంటర్‌రోడ్డులోని ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన డివైడర్ ప్రమాదకరంగా మారింది. ఖమ్మం బైపాస్ రోడ్డులో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఢీకొట్టడంతో ఆ డివైడర్ ప్రమాదాలకు కారణమవుతోంది. దాంతో కాజీపేట మీదుగా వరంగల్ – హంటర్‌రోడ్డు ఆనుకుని ఉన్న ఖమ్మం బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు, నగరవాసులు జంకుతున్నారు.

కానరాని స్పీడ్ బ్రేకర్లు

ఖమ్మం బ్రిడ్జిపై స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు అధిక వేగంతో ప్రయాణిస్తున్నారు. ఈక్రమంలో ఒక్కోసారి నియంత్రణ కోల్పోయి ధ్వంసమైన డివైడర్‌ను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మున్సిపల్ కార్మికులు డివైడర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఓ లారీ వారిపైకి దూసుకెళ్లింది. దాంతో వారిలో కొంతమంది గాయాలపాలయ్యారు. ఓ ద్విచక్ర వాహనదారుడు డివైడర్‌ను ఢీకొనడంతో అతడి చెయ్యి విరిగింది. ఇలా రోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. అధికారులు స్పందించి ధ్వంసమైన డివైడర్‌ను పునరుద్ధరించి, ఖమ్మం బ్రిడ్జికి ఎదురుగా ట్రాఫిక్ పాయింట్ లేదా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నగర వాసులు వేడుకుంటున్నారు.

భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దు



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

హన్మకొండ అర్బన్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇచ్చే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మధ్యాహ్న భోజన కార్మికుల కమిటీ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని రెండు దశాబ్దాలుగా కార్మికులు అనేక కష్టనష్టాల కోర్చి నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులు రోడ్డు మీద పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నిడిగొండ రజిత, కె.సక్కుబాయి, పి.సమ్మక్క, పర్వీన్, పద్మ, సంధ్య, లక్ష్మి, రాధిక, విజయ, వసుంధర, రాణి, తస్లీమ్, షమీమ్, సరిత, శైలజ, నిర్మల, భద్ర, సుభద్ర, భాగ్యలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఈటలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్ / వరంగల్ చౌరస్తా: బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సరికాదని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశమంతా యుద్ధం వైపు చూస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రపంచ సుందరీమణుల కోసం ఏర్పాట్లు చేసి, నగరంలోని చిరు వ్యాపారుల వ్యాపార సముదాయాలను ధ్వంసం చేసిందని వాపోయారు. సమావేశంలో బీజేపీ నేత, మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, అరూరి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఖిలా వరంగల్: సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ఖిలా వరంగల్: 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని గోదాంలో సమ్మె వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నేత మైదం పాణి, మోహన్, నర్సయ్య, ఏలియా, వెంకన్న, మధు, మహేందర్, ప్రశాంత్, వెంకటేష్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు విజయవంతం చేయాలని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ హఫీజ్, భారత్ విభూషణ్ అవార్డు గ్రహీత దామెర కృష్ణ కోరారు. ఈమేరకు మార్కెట్ ఎదుట సమ్మె వాల్‌పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు ఎండగట్టాలని సూచించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఇంతియాజ్, స్టాలిన్, గోవిందు, కమలాకర్, శంశొద్దీన్, వెంకటస్వామి, గోవిందు, రవికుమార్, గాజర్ల శ్రీనివాస్, ప్రసన్న కుమార్, మనోహర్, మహేందర్, పద్మ కుమార్, రవి, శ్రీధర్, రమేష్, మహేష్, దాసు, సుగుణాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ కింద కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

- 'సాక్షి' కథనానికి స్పందన

ఖిలా వరంగల్: ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న చెత్తాచెదారంతో పాటు విద్యుత్ లైన్ కింద చెట్ల కొమ్మలను విద్యుత్ అధికారులు తొలగించారు. నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు వరంగల్ వరంగల్ ఫోర్ట్‌రోడ్డు భూపేష్‌నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, కరాటే ప్రభాకర్, జాఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

హసన్‌పర్తి: అధిక ధరలకు ఫర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఈ రాజ్‌కుమార్ హెచ్చరించారు. హసన్‌పర్తి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. షాపుల్లో ఉన్న నిల్వలను సరిచూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేశాక తప్పనిసరిగా దుకాణదారుడి నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అనురాధ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై ఎన్‌సీసీ కేడెట్ల మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

హన్మకొండ: హనుమకొండలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణపై ఎన్‌సీసీ కేడెట్లు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన కేడట్లు.. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, క్రౌడ్ కంట్రోల్‌పై మాక్ డ్రిల్ నిర్వహించారు. ట్రాఫిక్ జామ్‌ను ఎలా నియంత్రించాలి, గుంపుల నియంత్రణలో ఎలాంటి పాత్ర పోషించాలి, వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరేందర్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు కడిగించడం సిగ్గుచేటు

ఖిలా వరంగల్: సంస్కృతి పేరుతో ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ప్రపంచ అందగత్తెల కాళ్లు కడిగించడం సిగ్గుచేటు అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా సురేఖ, సీతక్క స్థానిక మహిళా మంత్రులుగా ఉన్నా ఓరుగల్లులో, రాణి రుద్రమదేవి, సమ్మక్క సారమ్మ, చాకలి ఐలమ్మ లాంటి వీరవనితలు పుట్టిన నేలపై తెలంగాణ బిడ్డతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం శోచనీయమని ఆవేదనను వెలిబుచ్చారు. యావత్ తెలంగాణ మహిళా లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: ప్రపంచ సుందరీమణుల పాదాలను మహిళలతో కడిగించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. సుందరీమణుల పాదాలను కడిగించి తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు.

కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ



వరంగల్ చౌరస్తా: వరంగల్ కాశిబుగ్గలోని లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 42వ రోజు గురువారం చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వివేకానంద యోగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సుదర్శన ప్రారంభించారు. వంగరి రాజమౌళి కాంతమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, ప్రతినిధులు దేవులపల్లి రాజేశ్వరరావు, మామిడాల రమేష్, కృష్ణ, వేముల నాగరాజు, మామిడాల సతీష్, వంగరి రవి, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వ్యక్తులపై కేసు

మడికొండ: బార్‌లో వెయిటర్‌పై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన పల్లపు మధు, పల్లపు యాదగిరి, పల్లపు రాజు, దువ్వ వినయ్ కలిసి ఓ బార్‌లో మందు తాగుతూ క్యారమ్ బోర్డు ఆడుతున్నారు. క్యారమ్ బోర్డుతో పక్కవారికి ఇబ్బంది కలుగుతోందని, దాన్ని తీసివేయాలని వెయిటర్ గుగులోతు మోహన్ కోరారు. దాంతో వారు కోపోద్రిక్తులై వెయిటర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించారు. బాధితుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధి గుడిబండల్ ప్రాంతంలోని ఓ కిరాణం షాపులో రూ.1.67 లక్షల విలువగల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడు బింగి రమేష్‌ను అదుపులోకి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్ రంజిత్, సబ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం ఉదయం వరంగల్ శివనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్రపు రాకేష్ (29) నగరంలోని ఓ వెండి షాపులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం గదిలో నిద్రపోయిన కొడుకు తల్లి అరుణ ఎంతలేపినా లేవకపోవడంతో, ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తేల్చి చెప్పారు. గుర్రపు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వివరించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పకూడదని చెప్పారు. గ్రామాల్లో యువత గంజాయి మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమవుతూనే నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి వెంట సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని, కమిషనర్ అశ్విని, కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతీ కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 10వ డివిజన్ పరిధి కాపువాడలోని టీపీటీ పాఠశాల ఎదుట రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే నాయిని గురువారం ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కుమార్‌యాదవ్, మంద రాకేష్, బొంత రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

విద్యారణ్యపురి: జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య కోరారు. జిల్లాలో మూడు బాలుర, ఒక బాలికల మైనార్టీ గురుకులాలు ఉన్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని వివరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలకు అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ మురళీధర్‌రెడ్డి, ఆర్ఎల్‌సీ తనుగుల శ్రీనివాస్, మైనార్టీ గురుకుల ప్రిన్సిపాళ్లు సతీష్, నీరజ, శిరీష పాల్గొన్నారు.

ప్రవేశాలు పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం సంధ్యారాణి

మడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సంధ్యారాణి సూచించారు. మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పాఠశాల ఆవాస ప్రాంతాల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 11 టీంలను ఏర్పాటు చేసుకోవాలని, టీమ్‌లో అంగన్‌వాడీ టీచర్, మెప్మా మెంబర్, మహిళా సమాఖ్య సభ్యురాలు, ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామ విద్యా రిజిస్టర్ అప్‌డేట్, ప్రత్యేక విద్యార్థుల నమోదు కార్యక్రమం, బడిబాట కార్యక్రమాలకు ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ మడికొండ హెచ్‌ఎం మల్లారెడ్డి, ఎస్సీ, బీసీ కాలనీ పాఠశాల హెచ్‌ఎం మాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవనశైలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ రెడ్డి

ఎంజీఎం: ఆరోగ్యకరమైన జీవనశైలికి విద్యార్థులకు వ్యాయామం ఎంతో అవసరమని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల నూతన పరికరాలతో విస్తరించిన కేఎంసీలోని జిమ్నాసియం (జిమ్)ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిమ్ సెంటర్‌లోని కొత్త పరికరాలను పరిశీలించి, వ్యాయామ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. జిమ్ సెంటర్‌ను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు, అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ విజయ్‌పాల్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ నవీన్, డాక్టర్ శ్రీధర్ రాజు, డాక్టర్ రమేష్, డాక్టర్ థామస్, విద్యార్థులు చక్రధర్ రావు, హర్షిత్ పాల్గొన్నారు.

కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఎక్కుతున్న భక్తులు

హన్మకొండ: సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు తరలివెళ్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులకు భక్తుల తాకిడి మొదలైంది. రద్దీకి అనుగుణంగా బస్సులు సమకూర్చి పుష్కరాలకు భక్తులను ఆర్టీసీ అధికారులు తరలిస్తున్నారు. వరంగల్ రీజియన్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, పరకాల, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. తొలి రోజు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వెళ్తునానరు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వరంగల్ రీజియన్ వ్యాప్తంగా గురువారం 70కి పైగా బస్సుల్లో భక్తులను కాళేశ్వరానికి చేరవేసినట్లు అధికారులు తెలిపారు. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశముందని, ఆ మేరకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

రామన్నపేట: వరంగల్ గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 – 21వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఒకచోట చేరి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈమేరకు నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు వాటర్ ప్యూరీఫయర్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, నాగేశ్వరి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.